క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌ను కలిసిన న్యాయవాదులు


విప్ అడ్లూరితో న్యాయవాదులు

ధర్మపురి: పట్టణానికి చెందిన న్యాయవాది ఇమ్మడి శ్రీనివాస్ ఇటీవల అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులు కాగా, సోమవారం శ్రీనివాస్, న్యాయవాదులు, మిత్రులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ను విప్ అభినందించారు.

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన కార్యదర్శులు


పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్యదర్శులు

మల్లాపూర్: అడిషనల్ కలెక్టర్(లోకల్‌బాడీ)గా అదనపు బాధ్యతలు చేపట్టిన అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బీఎస్.లతను సోమవారం జిల్లా పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేష్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరిస్తూ ప్రైవేటు పాఠశాలలు సెలవుల్లో తరగతులను నిర్వహిస్తున్నాయని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సునీల్ అన్నారు. సోమవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఒంటి పూట బడులు నిర్వహిస్తే జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు రెండు పూటల తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజు, నిఖిల్, రోశన్ పాల్గొన్నారు.

పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు


వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారి

కథలాపూర్: పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని మండల వైద్యాధికారి సింధూజ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్‌స్కూల్‌లోని హాస్టళ్లలో విద్యార్థినులకు సోమవారం ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం వారితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వార్షిక పరీక్షలు అంటే ఆందోళన చెందవద్దని, ప్రణాళిక ప్రకారం చదువుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుగుణ, సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎం శిరీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలపై బీజేపీ సమావేశం


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు

కోరుట్ల: దేశంలో ఒకే దేశం ఒకే ఎన్నికకు బీజేపీ కట్టుబడి ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు అన్నారు. పట్టణంలో సోమవారం బీజేపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జమిలీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించటంతో అనేక సంస్కరణలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మత్తడికి మరమ్మతు కరువు

- రెండేళ్లయినా పట్టించుకోని వైనం
- మట్టిపోసి, తాత్కాలిక మరమ్మతులు
- పూర్తి స్థాయి మరమ్మతు కోసం రైతుల వినతి


తాత్కాలిక మరమ్మతు చేపట్టిన మత్తడి


గండిపడిన తాటిపల్లి పెద్ద చెరువు మత్తడి(ఫైల్)

మల్యాల: రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు మత్తడి తెగిపోవడంతో చెరువులోని నీరు పొలాలను ముంచెత్తింది. చెరువులో చేపలుసైతం కొట్టుకుపోయి ముదిరాజ్‌లు ఉపాధి కోల్పోయారు. రెండేళ్లు గడుస్తున్నా మత్తడి మరమ్మతు చేపట్టేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. చేపల పెంపకం కోసం స్థానికులే తాత్కాలికంగా మత్తడిపై మట్టిపోసి, పూర్తి మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నారు.

మల్యాల మండలం తాటిపల్లి పెద్ద చెరువు ఇటు తాటిపల్లి రైతులతోపాటు అటు గంగాధర మండలం చెర్లపల్లె గ్రామ రైతులకు పంట చేలకు సాగునీరందిస్తోంది. సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 200 ఎకరాలకు ఆయకట్టుకు నీరందిస్తోంది. నీటితో కళకళలాడే పెద్ద చెరువు గతంలో నీరు లేక ఎండిపోవడంతో ప్రజల విన్నపాల మేరకు సమీపంలోని వరదకాలువకు తూము ఏర్పాటు చేసి, ఏటా చెరువు నింపడంతో పరిసర ప్రాంతాలు సస్యశ్యామలం అవుతున్నాయి. పెద్దచెరువు రెండు గ్రామాల రైతులతోపాటు ముదిరాజ్‌లకు చేపల పెంపకంతో ఉపాధినిస్తోంది. పెద్దచెరువుతో సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి, వ్యవసాయ బావుల్లో నీటి ఊటలతో వ్యవసాయానికి ఊతమిస్తోంది.

మత్తడి తెగిపోయి రెండేళ్లు..

తాటిపల్లి పెద్ద చెరువును నింపేందుకు వరద కాలువ తూము తెరవడంతోపాటు భారీ వర్షాలతో వరద తాకిడి పెరిగి మత్తడికి తెగిపోయింది. చెరువు కింద ఉన్న పొలాలు నీటితో మునిగిపోవడంతోపాటు సమీపంలోని లంబాడిపల్లి గ్రామ రైతుల పొలాలను సైతం వరదనీరు ముంచెత్తింది. మత్తడికి గండిపడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ మరమ్మతు దిశగా చర్యలు చేపట్టడం లేదు. వచ్చే వర్షాకాలం నాటికైనా మత్తడి మరమ్మతు పనులు చేపడుతారని రైతులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా మత్తడికి పూర్తి స్థాయి మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మల్యాల నీటి పారుదల శాఖ డీఈఈ తిరుపతిని వివరణ కోరగా, పెద్ద చెరువు మత్తడి మరమ్మతు పనులకు అంచనా వ్యయం సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

మరమ్మతు చేపట్టాలి



తాటిపల్లి పెద్ద చెరువు మత్తడి తెగిపోయి రెండేళ్లు గడుస్తున్నా.. అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. మత్తడి తెగిపోయి మా పొలం మునిగిపోయింది. రైతులతోపాటు ముదిరాజ్‌లకు ఉపాధి కల్పించే పెద్ద చెరువు తక్షణమే నిధులు కేటాయించి, మత్తడికి మరమ్మతులు చేపట్టాలి.

– పొన్నం మల్లేశం, రైతు, తాటిపల్లి

మత్తడిపై మట్టిపోసినం..



పెద్దచెరువుకు వరదనీరు పెద్ద ఎత్తున రావడంతోపాటు వరదకాలువ తూము తెరవడంతో నీటి ఉధృతి పెరిగి, మత్తడి తెగిపోయి చెరువులోని చేపలు కొట్టుకుపోయినాయి. మత్తడిపై సుమారు రూ.1.80 లక్షలు ఖర్చు చేసి, మట్టి పోసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినం. పూర్తి స్థాయిలో మరమ్మతు చేయించాలి.

– పంబాల సురేశ్, ముదిరాజ్

రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు


సమావేశంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ డైరెక్టర్లు

మల్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన సోమవారం మార్కెట్ కమిటీ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు అభివృద్ధికి పలు తీర్మానాలు చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు పథకాలను అమలు చేస్తుందని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల ప్రకారం రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మార్కెట్‌లో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో డీఎం ప్రకాశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి, డబ్బా సత్తమ్మ, కనకట్ల జలంధర్, యాళ్ల స్వామి రెడ్డి, పాపిరెడ్డి, కొలకని మారుతి, రామిడి శేఖర్ రెడ్డి, బర్ల లింగయ్య, ముప్పారపు సాగర్, ముదాం మల్లేశం, కంబళ్ల రాయమల్లు,ట్రేడర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

• ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

మల్లాపూర్: గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్న మాజీ సర్పంచ్‌లను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో ముందస్తు అరెస్టు చేయించడం తీవ్ర గర్హనీయమని మాజీ సర్పంచ్‌లు భూక్య గోవింద్‌నాయక్, వనతడుపుల నాగరాజు, సయ్యద్ హైదర్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మండల మాజీ సర్పంచ్‌లు శాసనసభ ముట్టడికి తరలివెళ్తారనే సమాచారంతో సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకుని ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు ఇబ్బందులు

మల్లాపూర్: మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పాలన వైఫల్యంతో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేసే వరకు బీఆర్‌ఎస్ క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుబంధు కమిటీ మాజీ మండల అధ్యక్షుడు కోమ్ముల జీవన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ ముద్దం శరత్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి,పాల్గొన్నారు.

• కార్యకర్తలకు అండగా నిలుస్తాం

మల్లాపూర్: కాంగ్రెస్ కుటుంబ సభ్యులైన ప్రతీ కార్యకర్తలకు అండగా నిలుస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, సుప్రీం కోర్టు అడ్వకేట్ కొమొరెడ్డి కరంచంద్ అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో ఆయన పర్యటించి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.కార్యక్రమంలో కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎర్ర భూమయ్య, శశిగౌడ్, ఆకుతోట చంద్రయ్య, రామ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

• చెరువు ఆక్రమణలను నియంత్రించండి

జగిత్యాలటౌన్: కొడిమ్యాల మండలం నమిలికొండ జఫర్‌ఖాన్ చెరువు శిఖం భూముల ఆక్రమణలను నియంత్రించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ శిఖం భూములను భూ ఆక్రమణదారులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. హద్దులు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని కోరారు.

• మామిడితోటల పరిశీలన

సారంగాపూర్: మామిడిలో పిందె రాలడం అధికంగా ఉందని, దీనికి అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని హార్టికల్చర్ శాఖ ప్రతినిధి రమణ అన్నారు. సారంగాపూర్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు మామిడి చెట్లు కాలిపోగా, వాటిని హార్టికల్చర్ ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. కాలిన చెట్ల చుట్టూ కుండీలు ఏర్పాటు చేసి తగినంత నీటిని క్రమం తప్పకుండా అందించాలని, ఒక కిలో డీఏపీ, 750 గ్రాముల పొటాష్‌ను అందిస్తే చెట్లు కోలుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఈవో వెంకటేశ్, కోండ్ర రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ఆర్‌అండ్‌ఆర్ ప్లాట్ల కబ్జాను అరికట్టాలి

వెల్గటూర్ : చెగ్యాంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మిగిలిపోయిన ప్లాట్ల కబ్జాను అరికట్టాలని, కాలనీలోని ప్లాట్ల వివరాలు ఇవ్వాలని కోరుతూ గ్రామానికి చెందిన యువకుడు పాడేటి శ్రీకాంత్ వెల్గటూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ప్లాట్లను రికవరీ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు శ్రీకాంత్ తెలిపారు.

తైబజార్ రద్దు చేయాలని ఎమ్మెల్సీకి వినతి

రాయికల్: పట్టణంలో తైబజార్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా లేఖలో ఆయన తైబజార్ ద్వారా రైతాంగం, రైతు కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, తోపుడు బండ్ల వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగిత్యాలలో లాగే రాయికల్‌లోనూ తైబజార్‌ను రద్దు చేయాలని లేఖలో కోరారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు అండ

జగిత్యాలక్రైం: పోలీసు శాఖలో పదవీ విరమణ పొందిన వారికి డిపార్ట్‌మెంట్ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం పదవీ విరమణ పొందిన హోంగార్డు రాములు దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొందడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, ఆర్‌ఐ కిరణ్‌కుమార్, ఆర్ ఎస్సై సుమన్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కమిటీ చైర్మన్ జువ్వాజి శంకర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాసనమండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ ఎల్.రమణ ఉద్యమకారుల గురించి మాట్లాడినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కనీసం ఊసెత్తడం లేదన్నారు. ఇప్పటికై నా ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాజు, లింగారెడ్డి, నాచుపల్లి రెడ్డి, ప్రేమ్, వేణుగోపాల్‌కుమార్ పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవానికి రండి



జగిత్యాల: జిల్లాలోని భక్త మార్కండేయ దేవాలయం, శ్రీసీతారామ కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు నిర్వాహకులు సోమవారం ఆహ్వాన పత్రిక అందించారు.


రాజన్న ఆలయంలో వైభవంగా పల్లకి సేవ

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గుండి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ మూర్తుల పల్లకి సేవ వైభవంగా వేడుకగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వొరుగల శ్రీనివాస్, రామచంద్రం, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు

కోరుట్ల: పట్టణంలోని అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కలవకుంట్ల విద్యాసాగర్ రావు-సరోజన దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

వారానికే పగుళ్లు..



జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో వారం రోజుల క్రితం సీసీరోడ్డు నిర్మించారు. నాణ్యతలేని ఇసుక, అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా సీసీరోడ్డు నిర్మించారు. దీంతో వారం రోజులకే సీసీరోడ్డు పగుళ్లు చూపాయి. నాణ్యత లేని రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్‌కు బిల్లులు నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్, ఆర్‌అండ్‌బీ ఏఈ, కథలాపూర్, సెల్‌ఫోన్ నంబర్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


చెక్కు అందిస్తున్న నాయకులు

మెట్‌పల్లిరూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో రూ.15 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులు,రూ.19 లక్షలతో చేపట్టే చెరువు కట్ట మరమ్మతుల పనులు, జగ్గాసాగర్‌లో రూ.3లక్షలతో చేపట్టనున్న ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి, వడ్డెర కాలనీలో రూ.9లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు సోమవారం భూమిపూజ చేశారు.అలాగే రామలచ్చక్కపేలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు ఖాసీం,లక్ష్మారెడ్డి, గంగాధర్, గణేశ్, తిరుపతిరెడ్డి, రవి, రాజారెడ్డి, దిలీప్, కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

• ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం అమలు చేయాలి

రాయికల్: ఆశా కార్యకర్తలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనంతో పాటు, ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్‌ఐ కల్పించాలని కోరారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ గణేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు అనిత, లత, అనురాధ, మమత, లక్ష్మి, జలజ, భారతి, సుమలత, సరిత పాల్గొన్నారు.

• ఇసుక లారీ,ట్రాక్టర్ పట్టివేత

మెట్‌పల్లిరూరల్:అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ,ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.ఆయన వివరాల ప్రకారం.. జగిత్యాల నుంచి ఇసుక లారీ, జగ్గాసాగర్ వైపు నుంచి ఇసుక ట్రాక్టర్ వస్తోంది. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది వాహనాలను ఆపి తనిఖీలు చేయగా అనుమతి లేకపోవడంతో పట్టుకుని లారీ, ట్రాక్టర్ యాజమానులు,డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

•విలువ గల వ్యక్తిత్వమే విజయానికి మూలం

జగిత్యాల: విలువలతో కూడిన వ్యక్తిత్వమే విజయానికి మూలమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వంపై శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెగిటివ్ ఆలోచనలు ఉన్న వారు పరిస్థితుల్లో సమస్యలను చూస్తే పాజిటివ్ ఆలోచన దృక్పథం ఉన్న వారు అవకాశాలను చూస్తామన్నారు.

• కళాశాలలో జాబ్‌మేళా

మహిళా డిగ్రీ కళాశాలలో టాస్క్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఐఫోన్ ఉత్పత్తి కేంద్రంలో పనిచేసేందుకు జాబ్‌మేళా నిర్వహించగా, 53 మంది విద్యార్థులు హాజరు కాగా, 28 మంది ఎంపికయ్యారు. వీరికి ప్రిన్సిపాల్ రామకృష్ణ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ కో-ఆర్డినేటర్ పాల్గొన్నారు.

• ఘనంగా మల్లికార్జునస్వామి ధ్వజ స్తంభం, నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభం, నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

• నిప్పంటుకుని ఇల్లు దగ్ధం

ఇబ్రహీంపట్నం: మండలం డబ్బాలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గోనే శంకర్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు దగ్ధమైనట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. ఆదివారం ఇంట్లో దేవుడి వద్ద దీపం వెలిగించి ఇంటికి తాళం వేసి వెళ్లారు. ప్రమాదవశాత్తు ఇల్లుకు నిప్పంటుకుంది. మెట్‌పల్లి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలార్పేసింది. అగ్నిప్రమాదంలో ఇంట్లోని వస్తువులు, రూ. 5 వేలు నగదు కాలిపోయినట్లు బాధితుడు గోనే శంకర్ పేర్కొన్నారు. దగ్ధమైన ఇల్లును కార్యదర్శి రవళి పరిశీలించారు.

• చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

కోరుట్ల: పట్టణంలోని జాతీయ రహదారి స్టేట్ బ్యాంకు సమీపంలో ఈ నెల 1వ తేదీన బైక్ ఢీకొని కథలాపూర్ మండలం అంబారిపేటకు చెందిన చిలుక అనసూర్య (65) తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. అనసూర్య వియ్యంకురాలు తోట గోదావరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

• అల్లీపూర్‌లో మోటార్ల చోరీ

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో పది రోజులుగా దొంగలు మోటార్లు దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో రైతులు పంట చేతికొచ్చే సమయంలో మోటర్లు దొంగతనానికి గురికావడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, పంట నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి చోరీలు అరికట్టాలని కోరుతున్నారు.

• హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపిక

ధర్మపురి: హాస్టల్ వెల్ఫేర్ ఫలితాలు సోమవారం విడుదల కాగా, ధర్మపురికి చెందిన కోయల్‌కార్ కావ్య మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ డిపార్టుమెంట్‌లో బాసర రెండో జోన్‌లో ఉద్యోగిగా ఎంపికయ్యారు. కావ్య లక్షెట్టిపేటలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది.

రాయికల్: పట్టణానికి చెందిన కల్లెడ రాజ్‌కుమార్ సోమవారం టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కల్లెడ రాజ్‌కుమార్‌ను గంగపుత్ర నాయకులు అభినందించారు.

• పౌష్టికాహారం అందించేందుకే కిచెన్ గార్డెన్

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం ఉపాధ్యాయులు కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేశారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా పాఠశాల హెచ్‌ఎం జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల సమీపంలో నిరుపయోగంగా ఉన్న భూమిలో ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించి చదును చేశారు. అనంతరం కూరగాయల మొక్కలు నాటి వాటికి నీటిని అందించారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో నాగభూషణం, కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహ్మామూర్తి, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి జరిమానా

జగిత్యాల: పట్టణంలోని బైపాస్‌రోడ్‌లో కిడ్నీకేర్ ఆస్పత్రి వారు బయో వేస్టేజీని బయట పడేస్తుండడంతో మున్సిపల్ అధికారులు ఆస్పత్రికి రూ.5 వేల జరిమానా విధించారు. కమిషనర్ చిరంజీవి మాట్లాడుతూ బయో వేస్టేజీని ఏజెన్సీ వాహనాలకు అందజేయాలని, బయటపడేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.